క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నేరడిగొండ: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సీట్లు అందుబాటులో ఉన్నాయని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియం ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో 6, ఎనిమిదో తరగతిలో 2 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ తెలుగు మీడియంలో బైపీసీ 40, ఎంపీసీ 40 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు బిర్సాముండా వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: క్రాంతి వీర్ బిర్సాముండా 123వ వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని హీరసుక్క జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ తెలిపారు. ఆదివాసీలు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మెస్రం క్రిష్ణ, కుడ్మేత ప్రకాష్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో నిర్మించిన శ్రీ ఉమామహేశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ గర్భగుడిపై గోపురాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

నూతన వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

ఆదిలాబాద్‌టౌన్: రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళి అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హార్టికల్చర్ కళాశాలలో ఆదిమ గిరిజన సమూహాల పోషకాహార జోక్య కార్యక్రమాన్ని నిర్వహించారు. బుర్కి, మంగ్లి రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గజానంద్, వెంకటేశ్, వీరేందర్, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని రోడ్డును విస్తరించి, రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని మానవ హక్కులవేదిక సభ్యులు, ఆర్టీఐ ఆక్టివిస్ట్ ఎండీ జాబీర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రోడ్డును విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా.. ఎలాంటి ఫలితం లేదన్నారు. మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతిష్, ఉపాధ్యక్షుడు భాలేరావ్ భాస్కర్, సంతోశ్, సురాజ్ పాల్గొన్నారు.

'చెరువులను కబ్జా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు'

ఆదిలాబాద్: బీఆర్ఎస్ నాయకులు చెరువులను కబ్జా చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువును పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఖానాపూర్ చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే వాగ్దానం చేశారని, చెరువు కబ్జా అవుతున్నా.. కనీసం స్పందించడం లేదన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఇంద్రవెల్లి: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

బేల: బేలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థులతో కలిసి మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్, ఓంప్రకాష్, నార్లవార్ అజయ్, ప్రీతం, సాయి, శ్రీనివాస్, కృష్ణ, అనుష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఎదులాపురం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 14న వైద్యారోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ తెలిపారు. ఈ విషయమై గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల ప్రణాళికలను అధికారులకు అప్పగించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవో వైసీ శ్రీనివాస్, శ్రీధర్, శ్రీకాంత్, రాహుల్ పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

- వేసవిలో గృహావసరాలకు భారీగా వినియోగం
- బిల్లులలో కూడా మార్పులు

గుడిహత్నూర్: నెలవారి పాలబిల్లు, పేపర్ బిల్లు, కేబుల్ బిల్లులో ఎలాంటి మార్పు లేదు కానీ కరెంటు బిల్లులో మాత్రం గణనీయంగా మార్పు వచ్చింది. ఏకంగా నెలకు రూ.500 నుంచి రూ. 1000 వరకు పెరిగింది. ఎండ తీవ్రతతో ఇళ్లలో విద్యుత్ వినియోగం పెరిగింది. రబీ పంటల సాగుకు సైతం కరెంట్ వాడకం పెరిగింది. మండలంలో జనవరి నుంచే క్రమేణ పెరుగుతూ ఏప్రిల్, మే నాటికి రెట్టింపు అయింది. పెరిగిన విద్యుత్ వాడకానికి అనుగుణంగా అధికారులు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. లోడ్ ఎక్కువై లైన్‌లు ట్రిప్‌లు కాకుండా ఆయా డీటీఆర్ పరిధిలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నారు. పెరిగిన విద్యుత్ వినియోగానికి సరిపడా సరఫరా చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలకు అధికారులు సకాలంలో మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించడంలో సఫలమయ్యారు. గడిచిన నాలుగు నెలల్లో విద్యుత్తు వినియోగంలో గణనీయంగా పెరుగుదల వచ్చినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

మండుతున్న ఎండలతో..

ఎండలతో ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోత, వేడి తగ్గడం లేదు. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఫలితంగా విద్యుత్ వాడకం పెరిగింది. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లతో పాటు టీవీలు రోజంతా వాడాల్సిన పరిస్థితి నెలకొంది. రూ.150 నుంచి రూ.200 విద్యుత్ బిల్లు వచ్చే కుటుంబాల్లో ఇప్పుడు రూ. 400 దాటుతోంది. ఇక వాణిజ్య విద్యుత్ బిల్లులు సైతం అదేస్థాయిలో రూ. 500 నుంచి రూ. 1000 దాటి వస్తున్నాయి.



గుడిహత్నూర్ సబ్‌స్టేషన్

పొదుపు సూచనలు పాటిస్తే మేలు ..

పెరిగిన విద్యుత్ వినియోగాన్ని అరికట్టాలంటే పొదుపు సూచనలు పాటిస్తే మేలంటున్నారు అధికారులు.

- సాధారణ గుండ్రని ఫిలమెంటు బల్బులకు బదులుగా కంపాక్టు ఫ్లోరోసెంటు బల్బులు వినియోగించాలి.
- ఫ్రిజ్‌లను గాలి ఎక్కువగా ఉండే చోట వాడడం ద్వారా విద్యుత్ వాడకం తగ్గుతుంది.
- టీవీని రిమోట్‌లో ఆఫ్ చేసి ఉంచినా విద్యుత్ వినియోగం అవుతుంది. కాబట్టి టీవీకి వచ్చే పవర్‌ను స్విచ్ఛాఫ్ చేయాలి. జీరో బల్బులు వాడడంతో కొంత ఆదా చేయవచ్చు.
- గదిలో ఎవరూ లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆఫ్ చేయాలి.
- ఎలక్ట్రిక్ వాటర్ హీటర్లు, ఎలక్ట్రిక్ గ్రీసర్‌లకు బదులుగా సోలార్ హీటర్లను వాడితే మేలు.
- రైతులు సేద్యానికి ప్రత్యేకంగా తగిన రేటింగ్ గల కెపాసిటర్లు బిగించుకోవాలి. రాపిడి లేని వాల్వ్‌లను వాడాలి.

పొదుపుగా వాడాలి



దేశంలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి లేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తోంది. అలా అని వాడకంపై నిర్లక్ష్యం తగదు. పొదుపు సూచనలు పాటించి విద్యుత్ వృథాను అరికట్టాలి.

– గౌతం, ఏఈ ఎన్పీడీసీఎల్, గుడిహత్నూర్

మండలంలో వినియోగించిన విద్యుత్ వివరాలు..

నెల	సేద్యానికి (యూనిట్లలో)	గృహ అవసరాలకు(యూనిట్లలో)
ఫిబ్రవరి	1652726	750864
మార్చి	1500524	776016
ఏప్రిల్	1119866	971884
మే	459619	935220

ఘనంగా చెరువుల పండుగ

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ, ఇచ్చోడ, గేర్జం, గుండాల, అడేగామ(కె), నర్సాపూర్, గుబ్బ గ్రామాల్లో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. సిరిచెల్మలో జరిగిన పండుగలో తహసీల్దార్ మోహన్ సింగ్, చిన్ననీటిపారుదల శాఖ డీఈ భీంరావు, సూపర్‌వైజర్ గుడురి రాజు, సర్పంచ్ గుండాల లక్ష్మిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇచ్చోడ ఎల్లమ్మకుంట వద్ద నిర్వహించిన పండుగల్లో ఎల్లమ్మకుంట కట్టమైసమ్మ శాశ్వత చైర్మన్ బత్తుల అశోక్, ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, నిమ్మల వెంకట్‌రెడ్డి, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ పాల్గొని మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ శతాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు డప్పుచప్పుళ్లతో బోనాలతో చెరువు వద్దకు చేరుకున్నారు. కట్ట మైసమ్మ పూజలు చేసి ప్రజలకు విందుభోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా వేడుకల్లో ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, కుడే కైలాస్, జావదే పార్వతిబాయి, తుమ్రం బాగుబాయి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కరత్వాడ, కంటిగాం, చింతలబోరి, అందూర్, రఘునాథ్‌పూర్, పిప్పల్‌ధరి, మామిడిగూడ గ్రామాల్లో చెరువుల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులు బోథ్ మండల కేంద్రం నుంచి కరత్వాడ చెరువు వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తుల శ్రీనివాస్, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో జీవన్‌రెడ్డి, బోథ్ ఈవో అంజయ్య, సర్పంచులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: పూజలు చేస్తున్న అధికారులు



ఇంద్రవెల్లి: బోనాలతో వెళ్తున్న నాయకులు

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్, దేగామ, భూతాయి, కాండ్లీ, గులాబ్‌తండా చెరువుల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ ఆడారు. అక్కడే వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోము, ఎంపీడీవో చౌహాన్‌రాధ, సర్పంచ్‌లు పరచ లావణ్య, లక్ష్మీ, విద్యాసాగరా, తిరుమల, సుశీల, గణేశ్, కానిందే రాజారాం, హీరాలాల్, మురళీధర్, విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల శివారులో వాగులు, చెరువుల వద్ద చెరువుల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో వాగుల, చెరువుల వద్దకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. యాపల్‌గూడలో ఆదిలాబాద్ రూరల్ ఎంపీపీ గండ్రత్ రమేశ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంతో పాటు సోన్‌కాస్, సాంగ్వి(జి) గ్రామాల్లో గురువారం చెరువుల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలు, బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, జెడ్పీటీసీ అక్షిత సతీష్ పవార్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో మహేందర్‌కుమార్ పాల్గొన్నారు.



బోథ్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటు వడూర్, రాజుర గ్రామాల్లో నిర్వహించిన చెరువల పండుగలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఆయా గ్రామాల్లో డీజే, డప్పు వాయిద్యాలతో మహిళలు బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచులు పెంట వెంకటరమణ, గాదె సమత, ఓర్స రాజుయాదవ్, అడిగం రాజు, పీఏసీఎస్ చైర్మన్‌లు మందుల రమేశ్, సాబ్లే కిషోర్ సింగ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సరుకులు పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన కోట్నాక్ గోపాల్ కుటుంబానికి రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశాడు. గోపాల్ గతకొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. కూతురు ఆరోగ్య పరిస్థితి కూడా సరిగా లేదు. నిర్మల్‌కు చెందిన కార్తీక్ సరుకులు అందించడంతో పాటు వైద్య సాయం చేస్తానని ముందుకొచ్చాడు.

పోషకాహారం ఇవ్వాలి

తాంసి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పోషకాహారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని పొన్నారి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు గంగమ్మ, దేవమ్మ, పాల్గొన్నారు.

అడహక్ కమిటీల నియామకం

ఆదిలాబాద్‌రూరల్: బీసీ కులాల ఐక్యత, గ్రామ, మండల స్థాయిలో సంఘం బలోపేతం కోసం కొత్తగా అడహక్ కమిటీలను నియమిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌లు తెలిపారు. 11న ఆదిలాబాద్, మావల మండలాల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆదిలాబాద్ జిల్లా మావలకు చెందిన శ్రీకాంత్ రెడ్డిని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి నియమించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఏఐసీసీ సభ్యురాలు సుజాత నివాసంలో నియమాక పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, మల్లేశ్, సంజీవ్ రెడ్డి, శేఖర్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

బోథ్: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోడం చందన్, జీసీడీవో ఛాయ అన్నారు. గురువారం మండలంలోరి కౌఠ (బి), సాంగ్వి గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ఎస్‌సీఆర్‌పీ విఠల్, గ్రామ పటేల్ అర్జున్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గంగాధర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈనెల 15 వరకూ జన్ బాగిదారీ

ఎదులాపురం: మహారాష్ట్రలోని పూణేలో జీ20 ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూప్ మీటింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో జన్ బాగిదారీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. జీ20, ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ– 2020 అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే గురువారం వాల్ పెయింటింగ్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించామన్నారు. ఈనెల 15 వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పనులు పూర్తి చేయాలని వినతి


ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని అన్నిశాఖల పనులు పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డికి ఆదివాసీ సంఘాల నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఈసమస్యలపై అధికారులకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ ఆదివాసీ యూత్ అధ్యక్షుడు గేడం నిరంజన్, కాశీరాం పటేల్, ఆత్రం తుకారాం పాల్గొన్నారు.

ఆయుర్వేద మందు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: మృగశిరకార్తెను పురస్కరించుకొని ఉబ్బసం వ్యాధి నియంత్రణతో పాటు రోగనిరోధక శక్తి పెంచేందుకు ఆయుర్వేదిక్ మందు పంపిణీ చేపట్టినట్లు వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్ వైద్యుడు యువరాజ్ వైద్య తెలిపారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సీసీఐ సమీపంలో గల రీసెర్చ్ సెంటర్‌లో ఆయుర్వేదిక్ మందు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ప్రజలు హాజరై మందు వేసుకున్నారు. ఎంపీ సోయం బాపురావుతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, తదితరులకు మందు వేశారు. రుతువులు మారే క్రమంలో వ్యాధులను తట్టుకునేందుకు ఆయుర్వేదిక్ మందు ఎంతగానో దోహదపడుతుందన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత మార్గంలో పయనించాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామ పరిధిలోని శ్రీగురు సాహెబ్ మందిరం వద్ద గురు సాహెబ్ కమిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షల వ్యయంతో గురువారం భూమి పూజ చేశారు. దైవ నామస్మరణతో మోక్షం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సోలంకి గీత కరణ్ సింగ్, ఎంపీటీసీ కృష్ణ, ఉప సర్పంచ్‌లు మదన్, దేవేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

అటెన్షన్ ప్లీజ్..

అల్లుకున్న నిర్లక్ష్యం

తాంసి: మండలంలోని గ్రామ శివారులో విద్యుత్ స్తంభానికి పిచ్చిమొక్క తీగ అల్లుకుంది. తాంసి సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్‌కు గాలివాన వీచినప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి అల్లుకున్న తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: మనోజ్ కుమార్, విద్యుత్‌శాఖ, ఏఈ, ఫోన్: 94408 11696



అభివృద్ధిని వివరించేందుకే దశాబ్ది వేడుకలు

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తాంసి: తెలంగాణలోని అభివృద్ధిని వివరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది వేడుకలు నిర్వహిస్తోందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు వద్ద నిర్వహించిన చెరువుల పండుగకు హాజరయ్యారు. మహిళలు బతుకమ్మ, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీటికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి చెరువులు, చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌందర్య, ఎంపీటీసీ అశోక్, తహసీల్దార్ శ్రీదేవి, ఇరిగేషన్ ఎస్ఈ రాము, మత్తడివాగు ఏఈ హరీష్, ఎంపీడీవో రవీందర్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



బోనంతో వస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తాంసి మండలంలోని పొన్నారి, సావర్గాం, తాంసి గ్రామాల్లోని చెరువుల వద్ద చెరువుల పండుగను నిర్వహించారు. చెరువు కట్టల వద్ద మైసమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల, వైస్ ఎంపీపీ రేఖ, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

బోథ్: ఈనెల 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. హుస్సేన్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాజీకి అవకాశం ఉన్న కేసులు, బ్యాంకు, సివిల్, క్రిమినల్ కేసులకు ఆరోజే పరిష్కారం చేసుకునే అవకాశం ఉందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఈనెల 10న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై భరత్ సుమన్ ఒక ప్రకటనలో కోరారు. రాజీ చేసుకునే ఇరువర్గాలు ఈనెల 6 నుంచి 10వరకు సంబంధిత పోలీసుస్టేషన్‌కి హాజరైనట్లయితే వారిని కోర్టులో ప్రవేశపెట్టి, కేసును పరిష్కరించడం జరుగుతుందన్నారు. యాక్సిడెంట్, చీటింగ్ కేసులు, భూతగాదాలు, వివాహ , చిన్న చిన్న దొంగతనం, అక్రమ రవాణా, పేకాట, లాక్ డౌన్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ కలహాలు, గుట్కా కేసులకు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని పరిష్కరించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జడ్జి బి.హుస్సేన్

బీమా పథకాలపై అవగాహన

ఇంద్రవెల్లి: జీవన జ్యోతి, సురక్ష బీమాయోజన పథకాలను గ్రామీణ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు ఎఫ్ఎల్‌సీ లోక రాంరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బీమా పథకాలు, బ్యాంకు సేవలు ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరికీ బ్యాంకులో పొదుపు ఖాతాలు ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వొద్దన్నారు. ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మెస్రం కోసేరావ్ మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఈవో ధరంసింగ్, సిబ్బంది సునీల్, లక్ష్మణ్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఇచ్చోడ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఫర్టిలైజర్ యజమానులపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేని విత్తనాలను స్టాప్ సెల్‌లో పెట్టినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోళ్లు చేయాలని, తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు.

ఫర్టిలైజర్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని రైతాంగానికి అవసరమైన విత్తనాలను ఇవ్వకుండా నాసిరకపు విత్తనాలను అంటగడుతున్న ఫెర్టిలైజర్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ నటరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు విత్తన కొరత రాకుండా చూడాలని, నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మికాంత్, ఆరిఫ్ మీర్జాబేగ్, ప్రేమకల, మెస్రం మీనా పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న ఏవో జాదవ్ కైలాస్

పండరీపురానికి పయనమైన భక్తులు

గుడిహత్నూర్: మండలంలోని విఠల్ రుక్మిణీ భక్తులు వార్‌కరీ సాంప్రదాయ పద్ధతిలో పండరీపురానికి పయనమయ్యారు. స్థానిక విఠల్ రుక్మిణీ ఆలయం వద్ద స్థానికులు వీరిని సాగనంపారు. శివాజీ మహరాజ్ వటంబే నేతృత్వంలో దిండి కొనసాగనుంది. మొదట వీరు మహారాష్ట్రలోని ఆళంది వరకు వాహనంలో వెళ్లారు. అక్కడి నుంచి పండరీపురానికి సుమారు 300 కిమీ. పాదయాత్రగా చేరుకుంటారు. వేలాదిగా దిండీలు, లక్షలాదిగా భక్తులు ఇలా పండరీపురానికి చేరుకొని భక్తిని చాటుకుంటారు. ఇందులో ఆలయ కమిటీ సభ్యులు కేంద్రే మాధవ్, రావణ్‌ముండే, బాలాజీ, అప్పా, ప్రహ్లాద్ ఫడ్, భరత్ గిత్తే, గోపినాథ్ ఉన్నారు.

'బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్ట్ చేయాలి'

ఆదిలాబాద్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం 2కె రన్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి రిమ్స్ ఆస్పత్రి వరకూ సాగింది. మహిళా రెజ్లర్లు కొన్ని రోజులుగా ఢిల్లీలో ధర్నా చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, పెటా అధ్యక్షుడు పార్థసారథి, సూర్యకుమార్, కిష్టన్న , శ్రీనివాస్, విలాస్, గౌస్ మొహియుద్దీన్, శివన్న, తదితరులు పాల్గొన్నారు.